సాక్షి
ఖమ్మం
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



రూ.5లక్షల పరిహారం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం ఇప్పిస్తూ లోక్ అదాలత్‌లో అవార్డు జారీ చేశారు. 8లో



హామీలన్నీ బుట్టదాఖలే..

రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏది కూడా అమలు చేయలేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

జమలాపురం ఆలయంలో ప్రత్యేక పూజలు



రూ.30లక్షల చెక్కు అందజేస్తున్న వెంకటరెడ్డి

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. శ్రీవారి పాదంతో పాటు స్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం జరిపించారు. అతర్వాత స్వామి, అమ్మవార్లను అలంకరించి నిత్యకల్యాణం, పల్లకీ సేవ నిర్వహించారు. కాగా, మండలంలోని భీమవరానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ దంపతులు వేమిరెడ్డి వెంకటరెడ్డి–రాధిక దంపతులు ఆలయంలో అన్నప్రసాద నిమిత్తం రూ.30లక్షల విరాళాన్ని ఈఓ జగన్మోహన్‌రావుకు అందచేశారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉప ప్రధాన అర్చకుడు ఉప్పల విజయదేవశర్మ, ముఖ్య అర్చకుడు మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీ.టీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీలను ఆది, సోమవారాల్లో నిర్వహిస్తున్నట్లు టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బాలబాలికలతో పాటు సీనియర్ పురుషులు, మహిళలకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఆదివారం ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని, వివరాలకు 98484 08335 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి డీడీఎన్ అర్చకులకు శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ధూప, దీప, నివేదన ఆలయాల అర్చకులకు ఆదివారం నుంచి 3వ తేదీ వరకు పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి పుణ్యక్షేత్రంలో తరగతులు ఉంటాయని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎ.సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. పాంచరాత్ర, వైదిక స్మార్త, వైఖానస, శైవ, వీరశైవ, గ్రామ దేవత ఆగమాల్లో నిష్ణాతులైన వారిచే అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్‌బీఐ–ప్రొబేషనరీ ఆఫీసర్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ.మహమూది తెలిపారు. జిల్లా నుంచి వంద మైనార్టీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 7వ తేదీ లోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, సమాచారం కోసం 08742–293565 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు 'స్వచ్ఛత' శ్రమదానం

నేలకొండపల్లి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ అభియాన్ తొమ్మిదో వార్షికోత్సవం, గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలో మెగా శ్రమదానం నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఉదయం 10 గంటల నుంచి గంటపాటు శ్రమదానం చేయాలని అధికారులు ఆదేశించారు. ఇందులో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. శ్రమదానం కంటే ముందు ఉదయం 9 గంటలకు గ్రామాల్లోని ప్రధాన సెంటర్‌లో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించాలని, ప్లాస్టిక్ వస్తువులను సేకరించాలని తెలిపారు.

అడిషనల్ డీసీపీ బోస్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ

ఖమ్మంక్రైం: ఖమ్మం కమిషనరేట్ అదనపు డీసీపీ సుభాష్‌చంద్రబోస్(సీటీసీ ప్రిన్సిపాల్) శనివారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. వ్యక్తిగత కారణాలను పేర్కొంటూ ఆయన గత వారమే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. దీంతో శనివారం రాత్రి హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, బోస్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్‌ఐ, సీఐగా విధులు నిర్వర్తించడమే కాక అడిషనల్ డీసీపీ(లా అండ్ ఆర్డర్)గా పనిచేశారు. ఇటీవల ఖమ్మం నుంచి బదిలీ కాగా, తిరిగి సీటీసీ ప్రిన్సిపాల్‌గా వచ్చారు. శనివారం మంత్రి కేటీఆర్ పర్యటన బందోబస్తులో కూడా పాల్గొన్న ఆయన ఉద్యోగ విరమణ చేయడం పోలీసుశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఖమ్మంపై గులాబీ గురి..

- మూడు నియోజకవర్గాల్లో మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటన
- రూ.1,797.52 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- పార్టీ అభ్యర్థులు పువ్వాడ అజయ్, సండ్ర, మదన్‌లాల్‌ను గెలిపించాలని పిలుపు
- రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆర్టీసీ బస్టాండ్ ఖమ్మంలోనే ఉందని వెల్లడి
- సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఏడున్నర లక్షల ఎకరాలకు నీళ్లు
- సండ్రను 70 వేల మెజార్టీతో గెలిపిస్తే సత్తుపల్లి జిల్లా!
- ఖమ్మం, సత్తుపల్లి ప్రగతి నివేదన సభల్లో మంత్రి కేటీఆర్



సత్తుపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు

సాక్షి ప్రతినిధి ఖమ్మం: ఖమ్మం జిల్లాపై గులాబీ పార్టీ గురి పెట్టింది. రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఎన్నికల శంఖారావం పూరించారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా నియోజకవర్గంలోని గుబ్బగుర్తిలో రూ.1,797.52 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్, కందాల ఉపేందర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కేటీఆర్ సుడిగాలి పర్యటన చేశారు. భద్రాచలం కూడా వెళ్లాల్సి ఉన్నా వర్షం కారణంతో రద్దయింది. ఖమ్మం కార్పొరేషన్ ఎదుట, ఎన్టీఆర్ పార్కు, గుబ్బగుర్తి, సత్తుపల్లిలో ఆయన ప్రజలు, పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. గత తొమ్మిదేళ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించడంతో పాటు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏం చేసిందంటూ విమర్శలు ఎక్కుపెట్టారు. అలాగే, పార్టీ మారిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించిన కేటీఆర్... టికెట్ ఇవ్వకపోయినా కేసీఆర్ వెంటే ఉంటానన్న వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌ను ప్రశంసించారు. మూడు నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఏం చేసారో ప్రస్తావించటంతో పాటు మంత్రి పువ్వాడ అజయ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బానోత్ మదన్‌లాల్‌లను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఆగమవుదామా.. అభివృద్ధిలో భాగం అవుదామా?

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలంటూ ఊదరగొడుతోంది. అయితే, చెబుతున్న వారికే సీటు గ్యారంటీ లేదు.. పార్టీకి వారంటీ లేదు. ఆరిపోయే దీపం లాంటిది ఆ పార్టీ. ఆకాశంలో చంద్రుడిని సత్తుపల్లి చౌరస్తాలో కట్టేస్తాం. కేసీఆర్ ఒకటి అంటే మేము రెండు చేస్తామని ఊదరగొడుతున్నారు. ఈ డైలాగులకు ఆగమవుదామా.. అభివృద్ధిలో భాగం అవుదామా.. అనేది మీరే ఆలోచించాలి. అభివృద్ధి సాగాలన్నా, ప్రగతి రథచక్రాలు ముందుకు సాగాలన్నా మీ ఆశీర్వాదాలు ఉండాలి. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం. ఇంత అభివృద్ధి చేసిన మంత్రి పువ్వాడ అజయ్‌ను మళ్లీ గెలిపించండి.

సత్తుపల్లి చైతన్యవంతమైన ప్రాంతం

సత్తుపల్లి చైతన్యవంతమైన ప్రాంతం. రాజకీయాల్లో పార్టీలు మారడం సహజమే. కానీ టికెట్ ఇవ్వలేదని కేసీఆర్ దుర్మార్గుడని నిందిస్తే ఎంత వరకు సమంజసం? సత్తుపల్లిలో 100 పడకల ఆస్పత్రి, పెనుబల్లి, కల్లూరుల్లో 50 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేశాం. రూ.125 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేసుకున్నాం. అలాగే, సత్తుపల్లికి నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశాం. సీతారామతో కాళ్లు కడుగుతామని చెబుతున్న నేతలు గత ప్రభుత్వాల్లో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదు? సీతారామ ప్రాజెక్టు 90 శాతం పూర్తికాగా, మిగతాది పూర్తికాగానే ఏడాదిలో సత్తుపల్లి నియోజకవర్గంలో 2లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయి. గోదావరి జలాలు తెచ్చి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో 7.50 లక్షల ఎకరాలకు నీళ్లు తెచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే.

ఎమ్మెల్యే వినతితో 'దళితబంధు'

ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరిక మేరకు సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధు ఇస్తాం. హుజూరాబాద్ తర్వాత ఆ స్థాయిలో సత్తుపల్లిలో వెంటనే కార్యక్రమాన్ని ప్రారంభించాలని అధికారులను చెప్పాం. అలాగే జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ విజ్ఞప్తి మేరకు మధిర నియోజకవర్గంలోని బోనకల్ మండలంలో కూడా దళితబంధు అమలు చేస్తాం. గొర్రెల యూనిట్ల పంపిణీ మందగించినా త్వరలోనే అందరికీ ఇస్తాం. సత్తుపల్లిలో పదేళ్లలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. సత్తుపల్లి జిల్లా కావాలని మీరు కోరుతున్నారు. కేసీఆర్ పది జిల్లాలను 33 జిల్లాలు చేశారు. మళ్లీ జిల్లా చేయాలంటే కేసీఆరే చేయాలి. జిల్లా చేసేలా కేసీఆర్ మనసు గెలుచుకోవాలంటే.. వెంకటవీరయ్యను 60 వేల నుంచి 70 వేల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపండి. ఆ డిమాండ్ కూడా నెరవేర్చుకుందాం... అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, కలెక్టర్ వీ.పీ. గౌతమ్, పోలీసు కమిషనర్ సీపీ విష్ణు ఎస్.వారియర్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా, వ్యవసాయ మార్కెట్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు విజయ్‌కుమార్, దోరేపల్లి శ్వేత, కూరాకుల నాగభూషణం, రాయల శేషగిరిరావు, వైరా మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరి ఉమామహేశ్వరరావు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ పాల్గొన్నారు.



మున్నేరుపై తీగల వంతెనకు శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్, తదితరులు

మీ ఎమ్మెల్యే స్వాతిముత్యం

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్: రాష్ట్రంలో 33జిల్లాలు ఏర్పాటుచేసిన సీఎం కేసీఆర్‌కు సత్తుపల్లి జిల్లా ఏర్పాటుచేయడం పెద్దపనేమీ కాదని కేటీఆర్ అన్నారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను 60వేల నుంచి 70వేల మెజార్టీతో గెలిపించాలని కోరారు. సత్తుపల్లి సభలో ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టును కేసీఆర్ 90శాతం పూర్తి చేశారని.. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అయినందున గోదావరి జలాలు ముందుగా సత్తుపల్లి నియోజకవర్గానికి అందుతాయని చెప్పారు. ఎమ్మెల్యే సండ్ర స్వాతిముత్యం సినిమా హీరోలా తమ వెంట పడి మరీ అభివృద్ధికి నిధులు తీసుకొస్తున్నారని కొనియాడారు. రూ.వెయ్యి కోట్ల నిధులు సత్తుపల్లికి వచ్చాయంటే ఎమ్మెల్యే కారణమని, ఆయన ఎమ్మెల్యేగా ఉండడం ప్రజలు అదృష్టమని తెలిపారు.

ఆకాశమంత అభివృద్ధికి చిరునామా ఖమ్మం

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మున్నేరుకు కరకట్టతోపాటు మున్నేరుపై తీగల వంతెన, లకారంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసుకున్నాం. గుబ్బగుర్తి వద్ద ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగింది. గోళ్లపాడు చానల్‌పై 11 కిలోమీటర్ల పొడవున కట్టిన పది పార్కులు, ఎన్టీఆర్ పార్కు ప్రారంభించుకున్నాం. ఆకాశమంత అభివృద్ధికి చిరునామా మన ఖమ్మం. మంత్రి పువ్వాడ సారథ్యాన హైదరాబాద్ తర్వాత ఖమ్మంలో అతిపెద్దదైన ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాం. రూ.230 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా 50 వేల కొత్త కనెక్షన్లు ఇస్తూ తాగునీటి సమస్య పరిష్కరించాం. కాంగ్రెస్ హయాంలో లకారం ట్యాంక్‌బండ్ ఎలా ఉంది.. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక ఎంత అద్భుతంగా మారిందో మీరే చూస్తున్నారు. కేసీఆర్ నాయకత్వంలో ఖమ్మం, కొత్తగూడెంకు మెడికల్ కాలేజీలు, రెండు నర్సింగ్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. ప్రత్యేకించి జేఎన్‌టీయూ కళాశాల కూడా ఖమ్మంకు మంజూరు చేశారు.



సుందరయ్య పార్క్‌లో వాలీబాల్ సర్వీస్ చేస్తున్న మంత్రి కేటీఆర్

పామాయిల్ ఫ్యాక్టరీ.. రైతుల అదృష్టం

- ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,500 మందికి ఉపాధి
- 'గోద్రేజ్' ఫ్యాక్టరీకి భూమి పూజ చేసిన మంత్రి కేటీఆర్



మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రాములునాయక్, మదన్‌లాల్

కొణిజర్ల: రానున్న ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుని ఆ దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పురపాలక పరిశ్రమల శాఖా మంత్రి కేటీఆర్ వెల్లడించారు. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధి అంజనాపురంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ వారు నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ ఆయిల్‌పామ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శనివారం ఆయన రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అవసరమయ్యే 70 శాతం పామాయిల్ ఇండోనేషియా, మలేషియా దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుండడంతో సీఎం కేసీఆర్ సారథ్యాన రైతులను సాంప్రదాయేతర పంటల సాగు వైపు మళ్లించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ నిర్మించే పామాయిల్ ఫ్యాక్టరీలో 3,500 మందికి ఉపాధి లభించనుండడమే కాక వేలాది మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. రైతును రాజుగా చేసిన కేసీఆర్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. ఇదే సమయాన ఓట్ల కోసం కల్లబొల్లి కబుర్లు చెప్పేవారు, డబ్బు సంచులతో వచ్చే వారిని నమ్మొద్దని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు.

వారి బాధను ప్రపంచ బాధగా..

కాంగ్రెస్ పార్టీ అంటే గ్యారంటీ కాదని అది పక్కా 420 పార్టీ అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ నేతలు కల్లబొల్లి కబుర్లతో ఓట్లు అడిగేందుకు వస్తున్నారని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు ఖమ్మం జిల్లాలో కూడా రాజకీయాలు వేగంగా మారుతున్నాయని చెప్పారు. పదవులు రాని వారి బాధను ప్రపంచబాధగా చూపేందుకు యత్నిస్తున్న నేతల మాటలు నమ్మి అనుక్షణం కష్టపడి పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఓడించుకుందామా అని ప్రశ్నించారు. కాగా, జిల్లా ప్రజలు, వారి చైతన్యంపై తమకు నమ్మకం ఉందని కేటీఆర్ తెలిపారు. అనివార్య కారణాలతో వైరా టికెట్ రాములునాయక్‌కు కాకుండా బానోత్ మదన్‌లాల్‌కు కేటాయించాల్సి వచ్చిందని కేటీఆర్ చెప్పారు. అయినా, తనకు ఎమ్మెల్యే పదవి గడ్డి పరకతో సమానమని, గిరిజనుల రిజర్వేషన్లు కేసీఆర్ తాను ఎమ్మెల్యేగా ఉండగా ఇవ్వడంతో జన్మ సార్థకమైందని రాములునాయక్ అనడంతో అందరి మనసులు గెలుచుకున్నాడని చెప్పారు. ఆయను గుండెల్లో పెట్టుకుని చూసుకునే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. కాగా, వైరాలో అందరూ కలిసి పనిచేస్తూ మదన్‌లాల్ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ చంద్రావతి, బానోత్ మదన్‌లాల్, గోద్రెజ్ కంపెనీ సీఈఓ గుర్విజ్ గోద్రేజ్, ప్రతినిధులు రాకేష్, శ్రీవాస్తవ, జెడ్పీటీసీ పోట్ల కవిత, సర్పంచ్‌లు మీర్జా రోషన్ బేగ్, దేవీ నాగేంద్ర, దొడ్డపనేని నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సెమినార్లతో న్యాయవాదుల్లో వృత్తి నైపుణ్యం



రిటైర్డ్ జడ్జి భానును సన్మానిస్తున్న నిర్వాహకులు, పక్కన హైకోర్టు జడ్జి నగేశ్

ఖమ్మంలీగల్: సెమినార్ల నిర్వహణ ద్వారా యువ న్యాయవాదుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించవచ్చని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి కేసీ భాను తెలిపారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో శనివారం న్యాయవాద పరిషత్ ఆధ్వర్యాన నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సమాజంలో నేరాలను అరికట్టడంలో న్యాయవాదులు తమవంతు పాత్ర సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. నేరస్తులకు శిక్ష విధించడంలో సాక్ష్యాధారాల చట్టం ముఖ్య పాత్ర పోషిస్తుందని పేర్కొన్న ఆయన, వివిధ క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్ మాట్లాడుతూ యాభై ఏళ్ల అనుభవం కలిగిన భాను బోధించిన తరగతులు యువ న్యాయవాదులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం జిల్లా జడ్జి బీఎస్ జగ్జీవన్ కుమార్ మాట్లాడుతూ చట్టాల్లో చాలా మార్పులు వచ్చాయని, సాంకేతికతను ఉపయోగించుకోవాలని, న్యాయస్థానాలపై నమ్మకం కలిగేలా న్యాయవాదులు విధులు నిర్వర్తించాలని సూచించారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వి.అపర్ణ, డి.రాంప్రసాద్‌రావు, ఎన్.అమరావతి, జావిద్‌పాషా, ఆశారాణి, కె.దీప, వి.మాధవి, ఆర్.శాంతిలతతో పాటు న్యాయవాది పరిషత్ బాధ్యులు హర్కర శ్రీరామారావు, వెంకటేశ్వరగుప్తా తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి వ్యాప్తంగా 'దళితబంధు'

బోనకల్ మండలానికి కూడా..

సత్తుపల్లి: సత్తుపల్లిలో జరిగిన సభలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వినతి మేరకు సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా దళితులకు దళితబంధు అమలుచేయనున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. అలాగే, మధిర నియోజకవర్గం బోనకల్ మండలంలో వర్తింపచేయనున్నట్లు తెలిపారు. ఆయన ప్రకటించిన గంటల వ్యవధిలోనే దళితులందరికీ పథకం వర్తించేలా శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, పార్క్ ప్రారంభం

- పార్క్‌ను పార్టీల సమావేశాలకు ఇవ్వొద్దు
- కలెక్టర్, కమిషనర్‌ను ఆదేశించిన కేటీఆర్



ఎన్టీఆర్ పార్క్‌లో విగ్రహం వద్ద మంత్రులు కేటీఆర్, పువ్వాడ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్ ఆ పక్కనే ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కాగా, ఏర్పాట్లు పూర్తికాకపోవడంతో విగ్రహావిష్కరణ సమయాన తలపై క్లాత్ తొలగిపోలేదు. దీంతో కొద్దిసేపు స్థానిక యువకులు కష్టపడి క్లాత్ తొలగించారు. ఇంతలోనే మంత్రి కేటీఆర్ పక్కనే ఏర్పాటుచేసిన ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన ముగిశాక మమత గ్రౌండ్‌లోని హెలీప్యాడ్ వద్దకు వెళ్లే సమయాన మరోసారి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి కేటీఆర్ నివాళులర్పించారు. అలాగే, ప్రజాప్రతినిధులతో ఫొటో దిగారు.

ప్రజల కోసం ఉపయోగించాలి..

ఎన్టీఆర్ పార్క్‌ను ప్రారంభించాక మంత్రి కేటీఆర్ ట్యాంక్‌బండ్‌పై నడుస్తూ పరిశీలించారు. లకారం పార్క్ అందంగా ఉందని, ఇది ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభికి సూచించారు. 'రాజకీయ పార్టీల సభలు, ఇతర సమావేశాల నిర్వహణకు పార్క్‌లో అనమతించొద్దు.. మా అజయ్ అడిగినా ఇవ్వకండి... ప్రజలకు ఆహ్లాదం పంచేందుకే మాత్రమే వినియోగించండి' అని సూచించారు.

కేసీఆర్, కేటీఆర్‌తోనే ఖమ్మం అభివృద్ధి

– రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో ఖమ్మంను అభివృద్ధి చేసుకోగలిగామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలో జరిగిన ప్రగతి నివేదన సభలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పురపాలక శాఖ మంత్రిగా ఉండడం ఖమ్మంకు గొప్ప వరమన్నారు. కేసీఆర్ కల్పించిన అవకాశంతో కేటీఆర్ ఖమ్మం అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని, తద్వారా ఖమ్మం నియోజకవర్గంలో రూ.3వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయగలిగామని తెలిపారు. అనంతరం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రగతి నివేదన బుక్‌లెట్లు ఆవిష్కరించారు.

రూ.వెయ్యి కోట్లతో సత్తుపల్లి అభివృద్ధి

– ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నియోజకవర్గంలో రూ.వెయ్యి కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేయడానికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారమే కారణమని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లి సభలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్‌కు పట్టణాలను అభివృద్ధి చేయాలనే సంకల్పం ఉన్నందున సత్తుపల్లికి అడిగినన్ని నిధులిచ్చి ప్రోత్సహించారని చెప్పారు. పనులన్నీ కాగితాలపై లెక్కలు కావని.. భూమిమీద పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల గౌరవం పెంచేలా పనిచేసిన తనను మరోమారు ఆదరించాలని కోరారు. అంతేతప్ప ఎన్నికల సమయంలో వచ్చేవారి మాటలను నమ్మొద్దని సూచించారు. కాగా, సత్తుపల్లిలో అభివృద్ధి పనులకు మంత్రులు కేటీఆర్, పువ్వాడ శంకుస్థాపన చేయగా... మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ దొడ్డా హైమావతి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసుతోపాటు శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కే.రఫీ, చల్లగుండ్ల కృష్ణయ్య, అంకమరాజు, వీరపనేని బాబీ, మట్టా ప్రసాద్, ఎస్.కే.చాంద్‌పాషా, వల్లభనేని పవన్ పాల్గొన్నారు.

ప్రతీ గుమ్మంలో పథకం

– ఎంపీ నామా నాగేశ్వరరావు

సత్తుపల్లి/సత్తుపల్లిటౌన్: బడుగు, బలహీన వర్గాలు బాగుండాలనే భావనతో సీఎం కేసీఆర్ ప్రతీ పథకాన్ని అందరి గుమ్మాలకు చేరుస్తున్నారని ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. సీఎం కేసీఆర్ దేశంలోనే ఏకైక రైతు నాయకుడని, రైతుబంధు కింద రూ.75వేల కోట్లు ఇచ్చిన చరిత్ర ఆయనదేనన్నారు. మంత్రి కేటీఆర్ ఎన్నో పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించారని కొనియాడారు.

మంత్రి కేటీఆర్ ఒక బ్రాండ్..

– రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి



సత్తుపల్లి: ప్రపంచ వ్యాప్తంగా యువకుల హృదయాల్లో స్థానం సంపాదించిన మంత్రి కేటీఆర్ ఒక బ్రాండ్‌లా నిలిచారని రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధిరెడ్డి అన్నారు. కేటీఆర్ అమెరికాలో చదువుకోగా అక్కడే స్థిరపడే అవకాశం ఉన్నా తెలంగాణ ఉద్యమంలో పాల్గొని మంత్రిగా ఐటీని విస్తృతం చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని తెలిపారు. సత్తుపల్లి అభివృద్ధికి జలగం వెంగళరావు అంకురార్పణ చేశారన్నారు. కాగా, ఎన్టీఆర్, వైఎస్ఆర్ రైతు అనే మాట గుర్తుకొచ్చేలా చేశారని, సీఎం కేసీఆర్ తెలంగాణ సాధించడమేకాక అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ తనకు ఇచ్చిన రాజ్యసభ సభ్యత్వంతో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేస్తానని వెల్లడించారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీకి ఎంపిక


చైత్ర, కిరణ్మయి

ఖమ్మంస్పోర్ట్స్: రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు చైత్ర, కిరణ్మయి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖమ్మం అర్బన్ మండలం వి.వెంకటాయపాలెంకు చెందిన వీరు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో రాష్ట్రజట్టు తరఫున పాల్గొంటారని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సెల్యూకాస్, ఆదర్శ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగాలకు ఎంపిక

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్ ప్లేస్‌మెంట్ సెల్, టీఎస్‌కేసీ(తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్) ఆధ్వర్యాన శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా రిలయన్స్ జియో ఇన్ఫోకాం కంపెనీలో సేల్స్ డిస్ట్రిబ్యూషన్ అసిస్టెంట్, టెలికాలర్ ఉద్యోగాలకు 32 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు ఆయన నియామకపత్రాలు అందజేసి మాట్లాడారు. అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు వి.సాంబశివరావు, రమాసత్యవతి, డాక్టర్ సీహెచ్.శ్రీనివాసులు, అనురాధ, వేణుమాధవ్, రమణ, కిశోర్‌కుమార్, వేదాద్రి పాల్గొన్నారు.

కోయచలకలో శోభాయాత్ర

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణనాథులను శనివారం శోభాయాత్రగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లడ్డూలు వేలం వేశారు. సెవెన్‌హిల్స్‌లోని లడ్డూను తోట గోపి, మహేశ్ రూ.45 వేలకు, బీసీ కాలనీలో లడ్డూను అమరం నాగరాజు రూ.43 వేలకు, మెయిన్‌రోడ్డులోని మండపం లడ్డూను రూ.23,116కు అమరం పరమయ్య దక్కించుకున్నారని తోట వెంకట్ తెలిపారు.

'లక్కినేని'కి బీజేపీ ఆహ్వానం


సుధీర్‌బాబుతో చర్చిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీలో చేరాలని లక్కినేని సుధీర్‌బాబును ఆ పార్టీ నాయకులు ధర్మారావు, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆహ్వానించారు. ఖమ్మంలో శనివారం లక్కినేనిని కలిసిన వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆలస్యం రవి, రాంబాబునాయక్, పెద్దపోయిన శ్రీనివాసరావు, గొరసాని రామిరెడ్డి, కట్టబోయిన మల్లేశ్, మదార్, వీరునాయక్, ఏటుకూరి ధర్మేంద్ర, ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

శిక్షణార్థులకు సర్టిఫికెట్లు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఉన్న రైసెట్ కేంద్రంలో వివిధ విభాగాల్లో ఇచ్చిన శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా అభ్యర్థులకు ఎస్‌బీఐ ఆర్‌ఎం విజయ్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారు స్వయం ఉపాధితో జీవితంలో రాణించాలని సూచించారు. అనంతరం ఆయన కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాసరావు, డైరెక్టర్ నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగులకు పదోన్నతి ఉత్తర్వులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో ఉద్యోగోన్నతి పొందిన వారికి శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఖమ్మంలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో చైర్మన్ కూరాకుల నాగభూషణం వారికి నియామకపు పత్రాలు అందించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల ఆధారంగా అర్హత సాధించిన మొత్తం 15 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. ఇందులో మేనేజర్‌గా ఉన్న కళ్యాణి అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అలాగే, అసిస్టెంట్ మేనేజర్లుగా ఉన్న ఇందు, సతీష్, మమతకు మేనేజర్లుగా, స్టాఫ్ అసిస్టెంట్లుగా ఉన్న రేష్మ, చంద్రిక, నిరీష, చరిష్మా, శిరీష, కృష్ణవేణి, సునీల్, బాలకృష్ణ, ఉదయ్, ప్రార్ధన విజయ, సుధాకర్‌కు అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి లభించింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ ఆట్లూరి వీరబాబు, జనరల్ మేనేజర్లు నర్మద, పద్మావతితో పాటు డీజీఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించాలి

ఖమ్మంమామిళ్లగూడెం: హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్యభవన్‌లో శనివారం స్వామినాథన్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించాక మాట్లాడారు. దేశంలో ఆహారభద్రత కోసం హరిత విప్లవానికి బాటలు వేసిన స్వామినాథన్ సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నున్నా నాగేశ్వరరావు, మాదినేని రమేశ్, పొన్నం వెంకటేశ్వరరావు, తాతా భాస్కర్‌రావు, తుళ్లూరి రమేశ్, మీరా, భద్రయ్య, సుధీర్, వెంకటేశ్వరరావు, మురళి పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు!

- ఖమ్మంలో రూ.1,369 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు
- మంత్రి పువ్వాడతో కలిసి పాల్గొన్న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- ప్రగతి నివేదన సభలో ప్రసంగం


సుందరయ్య పార్కులో 'ఐ లవ్ ఖమ్మం' బోర్డు వద్ద మంత్రులు కేటీఆర్, పువ్వాడ, ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, కమిషనర్ ఆదర్శ్ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్/ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం జిల్లా కేంద్రంలో శనివారం పర్యటించిన రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. హెలీకాప్టర్‌లో ఖమ్మం వచ్చిన ఆయన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ఆర్టీసీ బస్సులో నగరంలో పర్యటిస్తూ పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. తొలుత లకారం ట్యాంక్‌బండ్ వద్ద రూ.1.37 కోట్లతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించి పక్కనే ఉన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే లకారం చెరువు వద్ద రూ.10 కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, అమృత్ 2.0 కింద రూ.249.50 కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 20వ డివిజన్ రామచంద్రయ్యనగర్‌లో రూ.71 లక్షలతో కేఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్ టర్ఫ్ కోర్టును ప్రారంభించారు. గోళ్లపాడు చానల్‌పై రూ.108.71 కోట్లతో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ జయశంకర్ పార్క్, అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పైప్‌లైన్, స్టోమ్ వాటర్ డ్రెయిన్లను మంత్రులు ప్రకాశ్‌నగర్ వద్ద ప్రారంభించారు. అలాగే, అమృత్ 2.0 కింద ప్రకాశ్‌నగర్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాల్వొడ్డు వద్ద మున్నేరుకు ఇరువైపులా రూ.690.52 కోట్లతో చేపట్టనున్న ఆర్‌సీసీ వాల్ (రక్షణ గోడ) నిర్మాణ పనులకు, రూ.180 కోట్లతో మున్నేరుపై నిర్మించనున్న కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. వీడీవోస్ కాలనీలో రూ.8.54 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించడంతో పాటు ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రెండో ప్యాకేజీ కింద రూ.20 కోట్లతో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఇటీవల కేఎంసీకి టీయూఎఫ్‌ఐడీసీ నుంచి మంజూరైన రూ.100 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు మంత్రులు కేటీఆర్, పువ్వాడ కేఎంసీ వద్ద శంకుస్థాపన చేశారు.

పలకరిస్తూ, అభివృద్ధిని వివరిస్తూ..

ఖమ్మంలో పర్యటించిన మంత్రి కేటీఆర్ స్థానికులను పలుచోట్ల పలకరించారు. ట్యాంక్‌బండ్‌పై కలియతిరిగిన మంత్రి కేటీఆర్ లకారంలో బోటు నిర్వాహకులతో ముచ్చటించారు. జీవనం ఎలా సాగుతుందని మంత్రి ప్రశ్నించగా.. లకారంపై పర్యాటకుల సంఖ్య పెరగడంతో ఉపాధి మెరుగు పడిందని సమాధానం ఇచ్చారు. ఫుట్‌బాల్ టర్ఫ్‌కోర్టు ప్రారంభించిన మంత్రి కేటీఆర్ క్రీడాకారులతో ఫుట్‌బాల్ ఆడారు. ప్రకాశ్‌నగర్ వద్ద గోళ్లపాడు ఛానల్‌పై పార్కులను ప్రారంభించాక మురు గు వాసన పోయిందా.. మీ సమస్య పరిష్కారం అయిందా అని ఆరాతీశారు. దీంతో దశాబ్దాల తమ సమస్యకు పరిష్కారం చూపించినందుకు ధన్యవాదాలు అని చెప్పగా, అభివృద్ధిని ఆదరించాలని మంత్రి సూచించారు. ఇక్కడ కార్పొరేటర్లు మంత్రి కేటీఆర్, పువ్వాడ అజయ్‌కుమార్‌ను గజమాలతో సత్కరించారు. మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


మంత్రి కేటీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న విద్యార్థినులు

కట్టుదిట్టమైన భద్రత నడుమ కేటీఆర్ పర్యటన

జిల్లావ్యాప్తంగా 121 మంది ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్ట్

ఖమ్మంక్రైం/సాక్షినెట్‌వర్క్: మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన భారీ పోలీస్ బందోబస్తు మధ్య ముగిసింది. కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని ప్రతిపక్షాలు పిలుపునివ్వడంతో జిల్లావ్యాప్తంగా శనివారం ఉదయం పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మంలో కాంగ్రెస్ కార్పొరేటర్ మిక్కిలేనేని మంజుల, ఆమె భర్త నరేందర్, కార్పొరేటర్ సైదులునాయక్‌ను అరెస్ట్ చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జావీద్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. ఇక న్యూడెమోక్రసీ, సీపీఎం, ప్రజాపంథా, టీడీపీ, బీజేపీ, సీపీఐ నాయకులు పలువురిని అరెస్ట్ చేశారు. ఇంకా కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం నాయకులు ముస్తఫా, నల్లమల రంజిత్, సంగబత్తుల నవీన్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. ఖమ్మం రూరల్ మండలంలో ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు నల్లమల రంజిత్, తాళ్లూరి శ్రీనివాస్, చేతుల నాగేశ్వరరావు, సతీశ్, మధు, తారక్ తదితరులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే, తిరుమలాయపాలెం మండలంలో కాంగ్రెస్ నాయకులు మందడి ఇజ్రాయిల్, గోళ్ల లింగయ్య, సాల్మన్‌రాజు, భూక్యా రమేశ్ తదితరులను కూడా అరెస్ట్ చేయగా, నేలకొండపల్లి మండలంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కృష్ణారావు, పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొత్తంగా జిల్లాలో 121 మందిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది. కాగా, ఖమ్మంలో కేటీఆర్ పర్యటన సందర్భంగా ఆయన వాహనం చుట్టూ రోప్‌పార్టీ ఏర్పాటుచేశారు. సీపీ విష్ణు ఎస్.వారియర్ బందోబస్తును పర్యవేక్షించగా, 500 మంది సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గంటలు.. 11 కార్యక్రమాలు

ఖమ్మం పరిధిలో మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రమైన ఖమ్మంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శనివారం సుడిగాలి పర్యటన చేశారు. మూడు గంటల పాటు ఖమ్మంలో పర్యటించిన మంత్రి కేటీఆర్ 11 కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ పర్యటన వివరాలు ఇలా ఉన్నాయి.

- ఉదయం 10.30 గంటలకు హెలీకాప్టర్‌లో మమత కాలేజీ మైదానానికి వచ్చారు.
- 10.40 గంటలకు లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఎన్టీఆర్ పార్క్‌ను ప్రారంభించి, విగ్రహాన్ని ఆవిష్కరించారు.
- 10.54 గంటలకు లకారం వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, అమృత్ 2.0 అండర్ గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.
- 11.12 గంటలకు 20వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఫుట్‌బాల్ టర్ఫ్ కోర్టును ప్రారంభించారు.
- 11.30 గంటలకు ప్రకాశ్‌నగర్ వద్ద పార్కులను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.
- 11.50 గంటలకు కాల్వొడ్డు వద్ద ఆర్‌సీసీ వాల్ నిర్మాణం, మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
- 12.15 గంటలకు వీడీవోస్ కాలనీలోని వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభించి, ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో నగరంలో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేశారు.
- 11.27 గంటలకు కేఎంసీ కార్యాలయం వద్ద రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, ప్రగతి నివేదన సభలో మాట్లాడారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు లకారం ట్యాంక్‌బండ్ వద్దకు చేరుకుని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఫొటోలు దిగారు.
- 1.28 గంటలకు మమత మైదానం నుంచి హెలీకాప్టర్ ద్వారా సత్తుపల్లి బయలుదేరారు.

అంధత్వంతో ముడిపెట్టి బీమా నిరాకరించొద్దు

ఫిర్యాదికి రూ.21.10 లక్షలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ తీర్పు

ఖమ్మంలీగల్: పుట్టుకతో వచ్చిన అంధత్వాన్ని కారణంగా చెబుతూ మృతుడి కుటుంబానికి బీమా డబ్బు నిరాకరించడం తగదని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ వెల్లడించింది. ఈ మేరకు ఫిర్యాదికి రూ.21,10,709ను వడ్డీతో సహా చెల్లించాలని శనివారం తీర్పు చెప్పింది. కేసు వివరాలిలా ఉన్నాయి.. వైరా మండలం గొల్లపూడికి చెందిన అమరనేని సత్యనారాయణ పుట్టుకతోనే అంధుడు. తల్లాడ మండలం అంజనాపురంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన 2021లో హెచ్‌డీఎఫ్‌సీ ఖమ్మం బ్రాంచ్‌లో రూ.38 లక్షల గృహరుణం తీసుకున్నాడు. ఇదే సమయాన రూ.21,10,709లకు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ గ్రూపు క్రెడిట్ ప్రొటెక్ట్ స్కీమ్ పాలసీ చేశాడు. కాగా, 2021 మే 28న కోవిడ్‌తో సత్యనారాయణ మృతి చెందగా కుటుంబీకులు బీమా నగదు కోసం బ్యాంక్‌ను సంప్రదించారు. అయితే, సత్యనారాయణకు పూర్తి అంధత్వం ఉన్నందున పాలసీ డబ్బు ఇవ్వడం కుదరదని తిరస్కరించారు. దీంతో ఆయన భార్య జమున జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా విచారించిన కమిషన్ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ వడ్లమన్నాటి లలిత, సభ్యురాలు అద్దెపల్లి మాధవీలత బ్యాంకు సేవాలోపాన్ని నిర్ధారించారు. ఫిర్యాదికి బీమా మొత్తం రూ.21,10,709ను వడ్డీతో సహా చెల్లించడమేకాక కేసు ఖర్చుల కింద మరో రూ.20 వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


శ్రీదేవి (ఫైల్)

చంద్రుగొండ/పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గౌరారం టోల్‌ప్లాజా సమీపాన జాతీయ రహదారిపై సెప్టెంబర్ 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామిశెట్టి శ్రీదేవి (45) ఖమ్మంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన రామిశెట్టి శ్రీనివాసరావు – శ్రీదేవి దంపతుల కుమారుడికి బాబు జన్మించాడు. ఈ మేరకు మొక్కు తీర్చుకునేందుకు 28వ తేదీన లింగగూడెంలోని శివాలయానికి కారులో బయలుదేరారు. మొక్కు తీర్చుకున్న అనంతరం వస్తుండగా, గౌరారం టోల్‌ప్లాజా సమీపంలోని దేవతలగుట్ట వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. దీంతో కారులో ఉన్న శ్రీనివాసరావు – శ్రీదేవి దంపతులతో పాటు వీరి కోడలు లీలావతి, ఆమె తల్లి వేమూరి నిర్మల తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో శ్రీదేవి శనివారం మృతి చెందగా, మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. కాగా, కారు డ్రైవర్ జాన్‌పాషాతోపాటు బాలుడు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

బస్సు ఢీకొని వృద్ధుడు..

కూసుమంచి: మండలంలోని పాలేరులో శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లావుల వెంకన్న (60) ఉదయం తన పొలానికి వెళ్లి ఇంటికి నడిచి వస్తుండగా హైదరాబాద్ నుంచి మధిర వెళ్తున్న డీలక్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకన్న కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, బస్సు డ్రైవర్ తేజ బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడపటంతోనే ప్రమాదం జరిగిందని వెంకన్న కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ కృష్ణప్రసాద్ తెలిపారు.

గాయపడిన బాలిక...

మూడుకు చేరిన మృతుల సంఖ్య

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు వద్ద డివైడర్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన మందపల్లి యోజిత(16) హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. సూర్యాపేట జిల్లా ఎస్‌ఎం పేటకు చెందిన సంతోష్‌కుమార్ ఖమ్మంలో జీవనం సాగిస్తుండగా, బంధువు అంత్యక్రియలకు కారులో వెళ్లి వచ్చేక్రమాన ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు వద్ద శుక్రవారం ప్రమాదం జరిగింది. ఘటనలో సంతోష్ – ఝూన్సీ మృతి చెందారు. కారులో ఉన్న వీరి పిల్లలు యోజిత, గగనతో పాటు సంతోష్ తమ్ముడి పిల్లలు గాయపడ్డారు. వీరిలో యోజిత, గగనను హైదరాబాద్ తరలించగా యోజిత శనివారం మృతి చెందింది.

గాయపడిన మహిళ...

ఖమ్మంఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఓ వ్యక్తి ఆ మహిళను ద్విచక్రవాహనంపై తీసుకొని వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ ప్రమాదం ఎక్కడ జరిగిందనేది తెలియలేదు. ద్విచక్రవాహనదారుడు తొలుత మయూరిసెంటర్ అని వన్‌టౌన్ పోలీసులకు చెప్పాడు. తర్వాత బోనకల్ రోడ్డులోని శ్రీరాంహిల్స్ వద్ద జరిగిందని చెప్పినట్లు తెలిసింది. దీంతో రాత్రి వరకు కూడా ఏ పోలీసుస్టేషన్‌లోనూ కేసు నమోదు కాలేదని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

లోక్ అదాలత్‌లో ప్రమాదం కేసు పరిష్కారం

రాజీ మార్గంలో రూ.5 లక్షల పరిహారం

ఖమ్మంలీగల్/కారేపల్లి: సుప్రీంకోర్టు ఇటీవల గోహర్ మొహమ్మద్ కేసులో వెలువరించిన మార్గదర్శకాల నేపథ్యాన జిల్లా కోర్టులో మోటారు ప్రమాద బీమా కేసు జిల్లా జడ్జి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ చొరవతో లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైంది. కారేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలై 25న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బయ్యారం మండలం సింగారానికి చెందిన సపావత్ శివను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆటోట్రాలీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఘటనపై శివ భార్య ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఆటో ట్రాలీ డ్రైవర్ పవన్ సాయి, యజమాని రావుల కృష్ణపై కేసు నమోదు చేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు జిల్లా కోర్టుకు వివరాలు అందజేశారు. మోటారు ప్రమాద నష్టపరిహారం కేసుగా స్వీకరించిన జిల్లా జడ్జి ఆదేశాలతో సెప్టెంబర్ 16న కోర్టు విచారించింది. అయితే, వాహనానికి సరైన బీమా లేదని చెప్పడంతో లోక్ అదాలత్‌లో రాజీ పడాలని సూచించారు. దీంతో బాధిత కుటుంబానికి రూ.5 లక్షలు చెల్లించడానికి అంగీకరించగా.. శనివారం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి డి.రాంప్రసాద్‌రావు లోక్ అదాలత్ అవార్డు జారీ చేశారు.

ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలే..

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క


భట్టికి వినతిపత్రం అందజేస్తున్న వైద్య సిబ్బంది

మధిర/ముదిగొండ/బోనకల్: తెలంగాణలో ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏది కూడా నెరవేర్చకుండా బుట్టదాఖలు చేస్తోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ముదిగొండ మండలం పమ్మిలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. హామీలను నెరవేర్చకుండా పదేళ్ల పాటు కాలయాపన చేసిన కేసీఆర్ పాలన ఇక వద్దని ప్రజలు నిర్ణయించుకున్నారని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వక పోగా, ఇప్పుడు గృహలక్ష్మి పేరుతో కొత్త నాటకం మొదలు పెట్టారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు జరగగా, మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావాలని అందరూ కోరుకుంటున్నారని చెప్పారు. కాగా, వైద్య ఆరోగ్య శాఖలో జీఓ 142ను రద్దు చేసేలా చూడాలని శాఖ ఉద్యోగులు ఊటుకూరు భాస్కరరావు, లంకా కొండయ్య తదితరులు భట్టికి మధిరలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అలాగే, బోనకల్‌లో ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె శిబిరాలను భట్టి సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమాల్లో రాయల నాగేశ్వరరావు, కందిమళ్ల వీరబాబు, ఇలవల పుల్లారెడ్డి, మట్టా బాబురాంరెడ్డి, దేవరపల్లి ఆదినారాయణరెడ్డి, గుడిపూడి ఝాన్సీరాణి, పైడిపల్లి కిశోర్, గాలి దుర్గారావు, కర్నాటి కోటి, పిల్లలమర్రి నాగేశ్వరరావు, భద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఎంత తొక్కితే అంత లేస్తుంది...

డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ఖమ్మంవన్‌టౌన్: కాంగ్రెస్ పార్టీ తుంగ పూస వంటిదని.. ఎంత గట్టిగా తొక్కితే అంత పైకి లేస్తామని జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో జిల్లాకు ఏం చేశారో చెప్పకుండా కేటీఆర్ కాంగ్రెస్‌పై విషం చిమ్మే ప్రయత్నం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో బీఆర్‌ఎస్‌కు భయం పట్టుకుందని తెలిపారు. కాంగ్రెస్‌కు ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందని, ఖమ్మంలోని పరిశ్రమలు కాంగ్రెస్ హయాంలో ఏర్పాటు చేసినవే అని గుర్తుచేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పర్యటనకు వస్తే కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు మిక్కిలినేని మంజుల, లకావత్ సైదులునాయక్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, దొడ్డా నగేశ్, మహ్మద్ రఫీదా బేగం, పల్లెబోయిన భారతిచంద్రం, పుచ్చకాయల వీరభద్రం, దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, పాలకుర్తి నాగేశ్వరరావు, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధాల నడుమ విగ్రహావిష్కరణ సరికాదు


మాట్లాడుతున్న రామనాథం

ఖమ్మంఅర్బన్: టీడీపీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయించి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహన్ని ఆవిష్కరించడం గర్హనీయమని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పేర్కొన్నారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ మహానుభావుడి విగ్రహాన్ని వేలాది మంది సమక్షంలో ఆవిష్కరించాల్సి ఉన్నా.. బీఆర్‌ఎస్ నాయకత్వం స్థానిక కార్పొరేటర్‌కు కూడా చెప్పకుండా ఆవిష్కరించటం జీర్ణించుకోలేకపోతున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు కొండబాల కరుణాకర్, కేతినేని హరీశ్, నాగార్జున శ్రీనివాస్, మల్లెంపాటి అప్పారావు, చుండూరు రాజరాజేశ్వరి, మండపల్లి రజని, వాసిరెడ్డి భాస్కర్‌రావు, మందా వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హైవే అధికారులపై పోలీసులకు ఫిర్యాదు

కూసుమంచి: ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై లింగారంతండా జంక్షన్ వద్ద బీటీ రోడ్డు వేయాలని హైవే అధికారులను కలిసి విన్నవించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆరోపిస్తూ తండా యువకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. జంక్షన్ వద్ద బీటీ రహదారి లేక తండాకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారడమే కాక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయమై హైవే సూపర్‌వైజర్‌ను కలవగా రోడ్డు వేయబోమని, ఏమైనా చేసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బానోత్ రవి, మాను, జగపతి, శ్రీను, వెంకన్న శ్రీకాంత్, రాము తదితరులు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్



Education

HOME TUTIONS

■ Venu Home Tutions : 1st to 10th All Subjects, Inter, EAMCET, IIT, JEE, Degree, B.Tech, Spoken English Welcome to Tutors. 89196 56387, 95810 90860 [M-1221612]

■ GVS Maths Tutions Wanted Tutors / Home Tutors for 1st to 10th & Inter for registrations. Contact Cell : 97016 84893. [M-1221623]

Real Estate

HOUSE FOR SALE

■ ఖమ్మం, వరంగల్ క్రాస్ రోడ్ దగ్గరలో G+3 కొత్త ఇల్లు అమ్మబడును. వి. వెంకటాయపాలెంలో న్యూ కలెక్టరేట్‌కు దగ్గరలో 279 గజాల ప్లాట్లు అమ్మబడును. వివరాలకు సంప్ర. 97051 50603. [M-1221642]

■ కొత్త ఖమ్మం కలెక్టరేట్‌కి కేవలం 2 కి.మీ. DTCP & RERA అప్రూవల్ పొందిన గేటెడ్ కమ్యూనిటీ వెంచర్ నందు 53 లక్షలకు ఇల్లు కట్టించి ఇవ్వబడును. లోన్ సౌకర్యం కలదు. సెల్ : 87908 47246, 96663 83338. [M-1221636]

PLOT FOR SALE

■ వైరా అయ్యప్ప గుడి ఎదురుగా మిట్టపల్లి ఫంక్షన్ హాల్ వెనుకాల గల సాయి మణికంఠ వెంచర్ నందు 200 గజముల 65 నెంబర్ ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 7386331444. [M-1190650]

■ ఖమ్మం, చిల్లకల్లు వంటి పట్టణాలకు చేరువలో వేగంగా అభివృద్ధి చెందుతున్న వత్సవాయి మండల కేంద్రంలోగల మా వెంచర్‌లో 100 గజాల ఇంటిస్థలం కేవలం రూ. 4,50,000/- మాత్రమే. వివరములకు సం: 9030644798. [M-1221754]

FLAT FOR SALE

■ "0" Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

TO-LET

■ ఖమ్మం, నెహ్రూనగర్, అంకురా హాస్పిటల్ ఎదురుగా సింగిల్ బెడ్ రూం పోర్షన్ అద్దెకు ఇవ్వబడును. వివరాలకు సంప్ర. 73826 64450 [M-1221641]

Services

HOMECARE SERVICE

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ (AP No.1) 24 గం॥లు వృద్ధులను, పేషెంట్ల సేవకు, బేబీకేర్, ఇంటిపని, వంటపనికి పనిమనుషులను మీ ఇంటికి పంపగలము ✆ 95420 855 88, 95423 05588 [B-1206740]

వధువు కావలెను

■ కమ్మ 2వ మ్యారేజ్ 33 నెలకు 50వేలు ఆదాయం కోటి ఆస్తిగల వరునికి కులకట్టు ప్రసక్తిలేని చదువుకున్న అందమైన వధువు కావలెను. సంప్ర॥ 9441275534 [G-751736]

Wanted

■ ఖమ్మంలోగల కస్బాబజార్‌లోని న్యూ సిటి బిగ్ సూపర్ మార్కెట్ నందు పనిచేయుటకు జెంట్స్ (Male) వెంటనే కావలెను. సంప్ర॥ 9989699786, 9949942265. [M-1221736]

■ ఖమ్మం జడ్పీ సెంటర్‌లో గల జిరాక్స్ & ఇంటర్నెట్ సెంటర్ నందు పని చేయుటకు యువతీయువకులు కావలెను. సెల్: 7013946874. [M-10415]

■ ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాలలో మా సర్వీస్‌నందు, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, టెక్నీషియన్స్ వెంటనే కావలెను. సంప్ర॥ 8074489455. [M-1221753]

■ ఖమ్మంలోని ప్రముఖ సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. జీతం : 11-13 వేలు. వివరాలకు సంప్ర.సెల్ : 70361 91924, 97016 13323 [M-1221648]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221733]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 91777 36926 [G-801113]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K Ph: 9640468899/ 9640258899 [H-189336]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP No.1) విజయవాడ శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవచేయుటకు M/F కావలెను. భోజనం + వసతి కలదు. జీ: 15-16వేలు. ✆ 8247500792, 8247500683. [B-1206730]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788378]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TS.No.-1) హైదరాబాద్‌లో శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవ చేయుటకు M/F కావలెను. భోజనం+వసతి+జీతం 15-16వేలు. ఫోన్: 9618221160, 9133271122 [H-788535]

■ రామకృష్ణ హోంకేర్ సర్వీస్: VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులసేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5వేలు ✆ 6281208600, 6281208656 [B-1068137]

■ జాబ్ గ్యారెంటీ మహిళలకు మా కంపెనీలో ఉచిత రూం+భోజనం ఇచ్చి జాబ్ ఇవ్వబడును. జీతం: 20,000/- వరకు ఏజెంట్స్ (1 మనిషికి: 5000/- కమీషన్) Ph: 8886733005/ 008 [H-793357]

■ Lahari Consultancy : All types of Jobs in Khammam & Hyderabad. Contact: Gangadhar. 9866682507. [M-1221756]

■ Required Senior site super visors & site accountant with exp in LIS projects for Karnataka / Maharashtra PVR Projects ltd : 040 - 23348080, 8309961452 hrd-pvrpl@pvrpl.co.in [H-781285]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792